## వాణీనికేతన్ జయకేతనం



విద్యార్థులతో కలిసి విజయ సంకేతం చూపుతున్న డైరెక్టర్, ఉపాధ్యాయులు

కమాన్‌చౌరస్తా, మే 1: కరీంనగర్‌లోని వాణీనికేతన్ బాలవిహార్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్సెస్సీ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణతతో విజయకేతనం ఎగురవేశారు. 52శాతం విద్యార్థులు 9 జీపీఏ, 10 జీపీఏ సాధించి అఖండ విజయంతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిలిచారు. 10 జీపీఏ సాధించిన వారిలో డీ శశాంక్, ఎం భువనవిజయ్, కే కశ్యప వద్ర, ఎస్ సాయిలాస్య ఉన్నారు. విలువలతో కూడిన విద్యనందిస్తూ విద్యార్థుల ఉన్నతికి బాటలు వేస్తున్నామని పాఠశాల డైరెక్టర్ పీ రేణుక తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభచూపిన విద్యార్థులను ఆమె అభినందించారు.

## ఆక్స్‌ఫర్డ్ అద్భుత ప్రతిభ



విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్ లింగయ్య

కరీంనగరంలోని రాంనగర్ ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభచూపారు. ఎప్పటిలాగే ఈసారి కూడా వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఏ పూజ, జీ స్వాతి 10 జీపీఏ సాధించగా, ఏ సింధూజ, ఎస్ రాంచరణ్ 9.8, బీ అశ్విత 9.7 జీపీఏ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఉప్పు లింగయ్య తెలిపారు. 47శాతం విద్యార్థులు 9.0 ఆపైన జీపీఏ పొందినట్లు వెల్లడించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

## రత్నం విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు

విద్యానగర్‌లోని రత్నం గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ఎస్సెస్సీ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. 11 మంది విద్యార్థులు 10 జీపీఏ, 17 మంది 9.8, 13మంది 9.7జీపీఏ, 60 మంది 9 జీపీఏ ఆపై జీపీఏ సాధించారు. వందశాతం ఉత్తీర్ణతతో ప్రతిభ చాటారని పాఠశాల వ్యవస్థాపకుడు కే రత్నయ్య తెలిపారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన పాఠశాల కరస్పాండెంట్ కే రమేశ్, ప్రధానోపాధ్యాయుడు కే ప్రవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు.

## బ్లూబెల్స్ విజయహాసం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

నగరంలోని హన్‌మాన్‌నగర్ బ్లూబెల్స్ పాఠశాల విద్యార్థులు ఎస్సెస్సీ ఫలితాల్లో అద్భుత ఫలితాలు సాధించి, విజయహాసం చేశారు. స్కూల్ స్థాపించిన నాటి నుంచి వరుసగా తొమ్మిదోసారి కూడా వందశాతం ఉత్తీర్ణత సాధించారు. తొమ్మిది మంది 10 జీపీఏ పొందగా, 45 మంది అత్యుత్తమ జీపీఏ సాధించారు. 10 జీపీఏ పొందినవారిలో జీ సాయిస్నిగ్ధరెడ్డి, బీ చరిస్మా, వీ ఆశిష్, వీ ఐశ్వర్య, ఎల్ మనివర్ధన్, జీ రష్మిల, బీ విష్ణువర్ధన్, వర్షిత్ ఉన్నారు. అలాగే, ఎం తేజస్వినిరావు, ఎస్ విశిష్ట 9.8, ఎం వర్షిణి, ఆర్ అశ్విత, టీ వంశీకృష్ణ, కే హర్షిత, బీ విఙ్ఞతేజ, వీ హన్సిక 9.7 జీపీఏ సాధించారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ జంగ సునీత మనోహర్‌రెడ్డి అభినందించారు.

## పారడైజ్ జైత్రయాత్ర



విద్యార్థులతో చైర్మన్ ఫాతిమారెడ్డి

నగర శివారులోని రేకుర్తి ప్యారడైజ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పది ఫలితాల్లో జైత్రయాత్ర సాగించారు. పాఠశాలకు చెందిన జే సాద్విక, వీ శివాని, పీ హాసిని, బీ శరణ్య, కే సతీశ్‌రెడ్డి, సామియా, రహీం, సాదియా స్మామిన్, రుహీ తబుస్సుమ్‌లు 10 జీపీఏ, 17 మంది 9.8 జీపీఏ, మరో 15 మంది 9.7 జీపీఏ పొందగా, 53 మందికి 9 జీపీఏకు పైగా వచ్చినట్లు పాఠశాల చైర్మన్ డా. పీ ఫాతిమారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

## విశ్వశాంతి విజయగీతిక



విద్యార్థులతో కలిసి విజయసంకేతం చూపుతున్న డైరెక్టర్లు

పదో తరగతి ఫలితాల్లో కరీంనగర్‌లోని రాంనగర్ విశ్వశాంతి విద్యాలయ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతతో విజయకేతనం ఎగురవేశారు. 11 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. మరో పది మంది 9.8జీపీఏ, 13 మంది 9.7జీపీఏ, ఆరుగురు 9.5 జీపీఏ పొందగా, మిగతా విద్యార్థులు 9.0 జీపీఏ సాధించినట్లు పాఠశాల డైరెక్టర్లు రమేశ్, ఆంజనేయులు, గిరిధర్,రాజేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులను, సహకరించిన పాఠశాల సిబ్బందిని వారు అభినందించారు.

## లారెల్ స్కూల్ జయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం మంజులరావు

కరీంనగరంలోని సప్తగిరి కాలనీ లారెల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జయభేరి మోగించారు. ఈసారి కూడా అద్భుతమైన ఫలితాలు సాధించారు. పది మంది 10 జీపీఏ సాధించగా, మరో పది మంది 9.8, మొత్తం 41మంది 9.0 జీపీఏ పొందినట్లు కరస్పాండెంట్ బీ వెంకటేశ్వర్‌రావు, హెచ్‌ఎం బీ మంజులరావు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయబృందానికి కృతజ్ఞతలు తెలిపారు.



కొత్తపల్లి మండలం చింతకుంట రోడ్‌షోలో అభివాదం చేస్తున్న వినోద్‌కుమార్, చిత్రంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, తదితరులు

# కాంగ్రెస్‌ను నమ్మద్దు.. బీజేపీ మాయలో పడద్దు

- ఆ పార్టీల మాటలు వింటే మునుగుడే
- ఆరు గ్యారెంటీలంటూ ముంచిన రేవంత్‌రెడ్డి
- గోదావరి నీళ్లను తమిళనాడుకు తరలించేందుకు మోడీ కుట్ర
- బడేభాయ్.. చోటేభాయ్‌ని నమ్మితే అన్యాయం చేస్తరు
- కరీంనగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బీ వినోద్ కుమార్
- కొడిమ్యాల, చింతకుంటలో రోడ్ షోలు

కొడిమ్యాల/కొత్తపల్లి, మే 1: ఆరు గ్యారెంటీలంటూ ప్రజలను మభ్యపెట్టి.. ఉత్తమాటలు.. ఉద్దెరహామీలు ఇచ్చిన కాంగ్రెస్‌ను మరోసారి నమ్మి మోసపోవద్దని, పదేళ్ల పాలనలో తెలంగాణకు అన్యాయం చేసిన బీజేపీ మాయలో పడొద్దని ప్రజలకు కరీంనగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ సూచించారు. ఆ రెండు పార్టీల మాయలో పడితే నిండామునగక తప్పదని హెచ్చరించారు. ఇక్కడ చోటే భాయ్ రేవంత్ రెడ్డి, ఢిల్లీలో బడే భాయ్ మోడీ కలిసి హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేస్తరని ధ్వజమెత్తారు. నదుల అనుసంధానం పేరిట బీజేపీ కొత్త నాటకం ఆడుతున్నదని, గోదావరి నీళ్లను కాపాడుకోవాలంటే పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక ఉండాలని స్పష్టం చేశారు. బుధవారం జగిత్యాల జిల్లా కొడిమ్యాలతోపాటు కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంటలో రోడ్‌షోలు నిర్వహించారు. ఆయా చోట్ల జనం నీరాజనం పలుకగా.. వారినుద్దేశించి వినోద్ మాట్లాడారు. గోదావరి నీళ్లను కృష్ణా నది మీదుగా కావేరి నదిలో కలిపి తమిళనాడుకు తరలించే కుట్రకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెరలేపిందని ఆరోపించారు. మన గోదావరి నీళ్లను ఎత్తుకుపోవడానికి అది మోడీ సొమ్ము కాదని మండిపడ్డారు. ఇదే జరిగితే తెలంగాణ ఎడారి అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి నీళ్లను కాపాడుకోవాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థినైన తనను గెలిపించాలని కోరారు. తెలంగాణలోని 33 జిల్లాల్లో ప్రతి జిల్లాకు నవోదయ పాఠశాల ఉండాలని, కానీ తొమ్మిది పూర్వపు జిల్లాల్లోనే ఉన్నాయని, ఇంకా 23 స్కూల్స్ ఏర్పాటు కాలేదన్నారు. రాష్ట్రంలో నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ ఒక్క నవోదయ పాఠశాల తేలేక పోయారని దుయ్యబట్టారు. పదేళ్ల బీజేపీ పాలనలో తెలంగాణకు అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. తాను 2014నుంచి 2019 వరకు ఎంపీగా ఉన్నప్పుడు కరీంనగర్‌కు రూ.వెయ్యి కోట్లతో స్మార్ట్ సిటీ, కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్, కరీంనగర్‌లో రూ.50 కోట్లతో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మాణ పనులు ప్రారంభించినట్లు చెప్పారు. జాతీయ రహదారులు కూడా తీసుకువచ్చానని పేర్కొన్నారు. కొండగట్టు దేవస్థానానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో మాట్లాడి తాను 334 ఎకరాల ఫారెస్ట్ భూమిని ఇప్పించినట్లు గుర్తుచేశారు. కానీ, హిందుత్వం పేరు చెప్పి రాజకీయ పబ్బం గడుపుకొనే బండి సంజయ్ మాత్రం ఇప్పటికీ నయాపైసా తీసుకురాలేదన్నారు. ఎన్నికలు వస్తేనే దేవుడు గుర్తుకు వచ్చే ఆయన ఐదేళ్ల పాలనలో ఒక్క గుడి తేలేదని, ఒక్క బడికి సైతం నిధులు ఇప్పించలేదన్నారు. ఉప్పల్ దగ్గర రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని ఐదేండ్లలో ఎంపీగా ఉండి కూడా సంజయ్ పూర్తి చేయించలేకపోయారని విమర్శించారు. రాబోయే తరాలు బాగుండాలని, పిల్లల భవిష్యత్ కోసం కేసీఆర్ ఆలోచన చేసి రాష్ట్రంలో 33 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా మరోసారి మోసం చేయడానికి ఎంపీ ఎన్నికలకు వస్తున్నదని, ప్రజలు కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించాలని సూచించారు.

### వినోద్‌ను గెలిపించాలి



బీజేపీ దొంగ మాటలు.. కాంగ్రెస్ గారడీ మాయలో పడి మరోసారి మోసపోవద్దని ప్రజలు అనుకుంటున్నరు. మళ్లీ కేసీఆర్ రావాలని కోరుకుంటున్నరు. గత ఎన్నికల్లో మోసం చేసి గెలిచిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నరు. దేశంతోపాటు రాష్ట్రంలోని అన్ని విషయాలపై సమగ్రమైన అవగాహన ఉన్న వినోద్‌కుమార్‌ను కరీంనగర్ ఎంపీగా గెలిపించాలి. పదేండ్లలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారు. త్వరలోనే ఆయన మళ్లీ సీఎం అవుతారు.

**- చింతకుంటలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్**

### ఆ రెండు పార్టీలను నమ్మద్దు



పార్లమెంట్‌లో తెలంగాణ గొంతు వినిపించాలంటే కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపించాలి. బీజేపీ దొంగ మాటలు, కాంగ్రెస్ గారడీ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దు. కేసీఆర్ పదేండ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. కాంగ్రెస్ వచ్చి ఆగం చేసింది. బీజేపీ తెలంగాణకు అన్యాయం చేసింది. ఆ రెండు పార్టీలను నమ్మొద్దు.

**- కొడిమ్యాలలో మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్**

### కొండగట్టుకు కోట్లాది నిధులు తెచ్చారు

చొప్పదండి నియోజకర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత వినోద్‌కుమార్‌దే. కొండగట్టు ఆలయ అభివృద్ధికి కోట్లాది నిధులు మంజూరు చేయించి అభివృద్ధికి బాటలు వేసిండు. ఎన్నికలు వస్తేనే సంజయ్‌కు దేవుడు గుర్తుకు వస్తడు. దేవుడి పేరు చెప్పి ఓట్లు అడిగే ఆయనను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. ఈ ఎన్నికల్లో వినోద్ కుమార్‌ను గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలి.

**- కొడిమ్యాలలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**



కొత్తపల్లి మండలం చింతకుంట రోడ్‌షోకు అశేషంగా తరలివచ్చిన ప్రజలు

# వారిది వ్యాపారం.. నాది పోరాటం

- మీ కష్టాలు తెలిసిన కార్మికుడి బిడ్డని
- చిక్కుల్లో ఉన్న సింగరేణిని కాపాడింది కేసీఆరే
- కాంగ్రెస్‌ను గెలిపిస్తే కష్టాలు తెచ్చింది
- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



అంతర్గాం :కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

కోల్‌సిటీ/ అంతర్గాం మే 1: 'కాంగ్రెస్వోళ్లకు ఉన్నట్లు నాకు పెద్ద పెద్ద కంపెనీలు లేవు. వ్యాపారాలు లేవు. కార్మికుడి బిడ్డగా పైవింక్లయిన్ పుట్టక ముందు నుంచే మీ కోసం పోరాడిన వ్యక్తిని' అని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఉద్ఘాటించారు. మీ ఇంట్ల మనిషిలెక్క మీకండ్ల ముం దుండె తనను పార్లమెంట్‌కు పంపిస్తే ప్రజల కోసం ప్రశ్నించే గొంతుకగా మారుతానని హామీ ఇచ్చారు. ప్రజలు ఆలోచించి కారుకు ఓటేసి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఇన్నాళ్లు మీ ఓట్లతో ఆస్తులు, వ్యాపారాలను వృద్ధి చేసుకున్న నాయకులకు తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. రామగుండం 12వ డివిజన్ కార్పొరేటర్ బొడ్డు రజితా రవీందర్ ఆధ్వర్యంలో పైవింక్లయిన్‌లో బుధవారం రం సీనియర్ సిటిజన్స్‌తో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. వృద్ధులను ఆత్మీయంగా పలుకరించి సమస్యలు తెలుసుకున్నారు. అంతర్గాం మండలంలో విస్తృత ప్రచారం చేశారు. సాయంత్రం అంతర్గాంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొని ప్రసంగించారు. సింగరేణిలో రక్తాన్ని చెమటగా ధారబోసి బొగ్గును వెలికితీసే కార్మికుల కష్టం తెలుసన్నారు. విరమణ తర్వాత వారు ఎదుర్కొనే ఇబ్బందులను గుర్తెరిగిన వాడినన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత చిక్కుల్లో ఉన్న సింగరేణిని కా పాడిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని చెప్పారు. కార్మికులు బార్డర్‌లో సైనికులతో సమానమని భావించిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. సమైక్య పాలకులు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరించి కార్మికుల బతుకుల్లో వెలుగులు నింపారని చెప్పారు. కానీ, నాలు గు నెలల క్రితం అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రజలను కష్టాల్లోకి నెట్టిందని దుయ్యబట్టారు. ప్రజలు కరెంట్ కోతలు, తాగు, సాగునీటి కొరతతో అల్లాడుతుంటే చోద్యం చూస్తున్నదని విమర్శించారు. మోసపూరిత 420 హామీలతో అధికారంలోకి వ చ్చిందని మండిపడ్డారు. వెంకటస్వామి కేంద్రమంత్రిగా ఉన్నప్పుడే అంతర్గాం స్పిన్నింగ్, వీవింగ్ మిల్లు మూతపడ్డదని గుర్తుచేశారు. అభివృద్ధిని పరుగులు పెట్టించడంతోపాటు అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత కేసీఆర్ సర్కారుకే దక్కిందని కొనియాడారు. ఓటర్లు విజ్ఞతతో వ్యవహరించాలని కోరారు. కార్మికుల జీవితాలనే మార్చిన వ్యక్తి కేసీఆర్ అని, ఆ కృతజ్ఞతగా తనను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, జడ్పీటీసీ ఆముల నారాయణ, వైఎస్ ఎంపీపీ మట్టలక్ష్మి మహేందర్‌రెడ్డి, నాయకులు కౌశికహరి, ధరణి రాజేశ్, తుంగపిండి సతీశ్, కుర్ర నూక రాజు ధర్మాజీ కృష్ణ, కుర్ర వెంకటమ్మ, కోల సంతోష్, కొలిపాక మధూకర్‌రెడ్డి, పీటీ స్వామి, మురళీధర్ రావు పాల్గొన్నారు.











